పౌష్టికాహారం తప్పనిసరి తీసుకోవాలి



మల్హర్: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న రాధిక



కాటారం: అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ వీణ

కాటారం: బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తప్పనిసరిగా పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, వీణ అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని ఇబ్రహీంపల్లి, గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారపదార్థాలతో పాటు పోషకాహార పదార్థాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో తయారు చేసే వంటకాలు తినడం అలవాటు చేసుకోవాలని స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరల్లో సైతం అనేక పోషకాలు ఉంటాయని వివరించారు. శిశువుకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని, ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు పట్టించాలని సూచించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, సుమతి, సువర్ణ, విజయ నిర్మల, ఆయాలు, బాలింతలు, గర్భిణులు, తల్లులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని మల్లారం, తాడిచర్ల, వల్లెకుంట అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సీడీపీ రాధిక ఆధ్వర్యంలో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడారు. 3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల చిన్నారులను అంగన్‌వాడీ ప్రీ స్కూలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలోకి పంపించిన పిల్లలకి ప్రీ స్కూల్ బుక్స్, పిల్లల ప్రొఫైల్ అభివృద్ధి చార్టు, పర్యవేక్షణ కార్డు ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆరు నెలల పాటు చిన్నారులకు తల్లి పాలే తాగించాలని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు కేంద్రంలో ఇచ్చే బాలామృతం, ఎగ్స్ తినిపించాలని వివరించారు.



పలిమెల: చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ శివరాణి

అనంతరం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను అందురూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి, పోషన్ అభియాన్ డీపీఏ స్వప్న, అమగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

పలిమెల: గర్భిణులకు రక్తహీనత, పిల్లల్లో పోషణలోపంపై మహిళలు తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి అన్నారు. బుధవారం మహదేవ్‌పూర్ సెక్టార్ పరిధిలోని పలిమెల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివరాణి మాట్లాడుతూ.. గర్భిణులకు రక్తహీనత తగ్గించటం గురించి పిల్లల్లో పోషణ లోపం నిర్మూలన గురించి తీసుకునే అహారంపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుశీల, కిష్టబాయ్, భారతి, శారద, సమ్మక్క, మంజుల, ఆయాలు, ఆశకార్యకర్తలు నాగలక్ష్మి, స్కూల్ హెచ్‌ఎం రవి, ఐసీపీఎస్ ప్రశాంత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

భూపాలపల్లి అర్బన్: ఎన్నో ఏళ్ల ఉద్యమం ఫలితంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చి హామీ విధంగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ కామిడి సతీష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి దాట వేసిందని అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ నిలబెట్టుకుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

కాపు కార్పొరేషన్‌పై..

కాటారం: కాంగ్రెస్ ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయం అని మున్నూరు కాపు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు, మండల మాజీ అధ్యక్షుడు కొట్టె శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వంద రోజులకే కార్పొరేషన్ ఏర్పాటు చేసి మున్నూరు కాపు కులస్తుల అభివృద్ధికి తోడ్పడుతున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ ద్వారా ఎంతో మంది పేద కులస్తులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు కృషి చేశారని సాధ్యమైందన్నారు. మున్నూరు కాపు కులస్తుల తరుపున సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మహదేవపూర్: విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీటీసీ గుండాల అరుణ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులచే తల్లిదండ్రుల పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

మహదేవపూర్: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఇసుక అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో మంగళవారం అర్ధరాత్రి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్న జేసీబీ, లారీలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి బాధ్యులైన ఓడేటి భరత్, పోతుగంటి సమ్మయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

సీఐని కలిసిన నాయకులు



చిట్యాల: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ డి.మల్లేష్ యాదవ్‌ను బుధవారం కాంగ్రెస్ యూత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్, నాయకులు అందుగుల రాజు, గొపగాని శివ, చిరంజీవి, అజయ్, టి.నాగరాజు, లటికే రాజు, రవీందర్, అజయ్, వినయ్, మహేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

సాక్షి ఎఫెక్ట్..

రేగొండ: మండలంలోని లింగాల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 15 రోజులుగా మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. దీంతో 'ఇంటి భోజనమే దిక్కు' అనే కథనం బుధవారం 'సాక్షి' ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

చిట్యాల: దళితులకు ఎస్సీ కార్పొరేషన్ పథకం ఏర్పాటు చేయడం అనందదాయకమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో శరవేగంగా అమలు చేస్తున్నారన్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం అహర్నిషలు కష్టపడి పని చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, ఎస్సీ జిల్లా కన్వీనర్ ఏకు రవీందర్, జిల్లా, మండల నాయకులు దొడ్డి కిష్టయ్య, గడ్డం కొమురయ్య, నేరేళ్ల సమ్మయ్య, సారయ్య, సదయ్య, కుమార్, బుర్ర శ్రీనివాస్, రాజు, నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

'ఉపాధి' కూలీలకు పనులు కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

పలిమెల: మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 75 మంది కూలీలతో ఉపాధిహామీ పనులు చేయించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. టైమ్లీ పేమెంట్ కూడా పెంచాలని టెక్నికల్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. వన్ జీపీ వన్ నర్సరీ నందు 100 శాతం విత్తనాలు మొలకెత్తే విధంగా ప్రణాళిక చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, ఏపీఓ సునీత, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

టేకుమట్ల: మండలంలోని వెలిశాల నవచైతన్య హైస్కూల్‌లో స్వయంపరిపాలన దినోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. డీఈఓగా పప్పుల స్వాతిక, ఎంఈఓగా మారాటి మహాలక్ష్మీ, ప్రధానోపాధ్యాయులుగా గొపు హారిక, ఉపాధ్యాయులు గా ఎండీ రియా, అవంతిక, అపూర్వ, రోహిత్, పవన్ తేజ్, రమణకుమార్, వైష్టవి తదితరులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు రాం మధుకర్, కరస్పాండెంట్ కారుకూరి నారాయణ, ఉపాధ్యాయులు రాజేశ్వరి, సుమలత, నితీషా, నాగమణి, చైతన్య, చిరంజీవి, స్వరూప పాల్గొన్నారు.



స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు

పాఠశాలలో మాక్ పోలింగ్



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న విద్యార్థి

చిట్యాల: మండలంలోని జడల్‌పేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ప్రధానోపాధ్యాయురాలు కె.వాసంతి ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఐదుగురు పోటీ చేయగా 9వ తరగతి చదువుతున్న బండి కార్తిక్ అనే విద్యార్థి గెలుపొందాడు. గెలుపొందిన విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేసి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.పద్మ, వెంకటేశ్వర్లు, సంజీవ్, రామకృష్ణ, మధు, పాషా, హరిత, లక్ష్మి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువ రైతు మృతి



హరీశ్‌రెడ్డి (ఫైల్)

కాటారం: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగిన యువ రైతు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన సంఘటన మండలంలోని చింతకాని గ్రామ పంచాయతీ పరిధిలోని జగ్గయ్యపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గయ్యపల్లికి చెందిన అంబటి హరీశ్‌రెడ్డి(30) రెండేళ్లుగా సొంత భూమి రెండు ఎకరాలతో పాటు మరో ఎకరం కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేస్తున్నారు. గత ఏడాది పంట దిగుబడి సరిగా లేక పెట్టుబడి కోసం రూ.4 లక్షల మేర అప్పు కాగా ఈ ఏడాది సైతం వాతావరణం అనుకూలించకపోవడంతో పంట సరిగా చేతికి రాక మరో రూ.2.50లక్షలు అప్పు అయింది. పంట సాగు కోసం చేసిన అప్పు తీర్చడం ఎలా ఇళ్లు గడవడం ఎలా అని హరీశ్‌రెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 10న మధ్యాహ్నం బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లిన హరీశ్‌రెడ్డి సుబ్బయ్యపల్లి వద్ద పురుగుల మందు తాగాడు. పురుగుల మందు తాగిన విషయం సమీప బంధువైన సురేశ్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న సురేశ్‌రెడ్డి చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు పరకాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య దుర్గ, 8 నెలల కుమారుడు ఉన్నారు. మృతుని తల్లి హనుమాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

వీడ్కోలు సన్మానం ఏది?

కాళేశ్వరం: కాళేశ్వరం దేవస్థాన పాలకవర్గం పదవీకాలం బుధవారంతో ముగిసింది. కాగా, దేవస్థానం అధికారులు కనీసం తమకు వీడ్కోలు సన్మానం, సభా కార్యక్రమానికి ఏర్పాట్లు చేయకపోవడంతో పాలకవర్గ సభ్యులు నిరాశపడుతున్నట్లు తెలిసింది.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు

కాటారం: మండలంలోని విలాసాగర్, గంగారం సమీపంలోని మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని కోరుతూ బుధవారం ఆయా గ్రామాలకు చెందిన పలువురు తహసీల్దార్ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేరు నుంచి అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తోడి హైదరాబాద్‌కు లారీల ద్వారా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక తవ్వకాల వల్ల రైతుల పంట భూముల్లోని బోర్లు ఎండిపోయి పంటలపై ప్రభావం పడుతుందని తహసీల్దార్‌కు విన్నవించారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో స్వామి, నయిమొద్దీన్, బాపు, జేవీఎస్ రావు, వాణి, రామచందర్ ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కొమురం భీం కాలనీ ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములను గిరిజనేతరులు అక్రమించుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్ సంఘటన ప్రాంతానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

వాజేడు: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని కొంగాల గ్రామంలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ.. గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుకోవాలని మంచి ఉద్యోగాలను సంపాదించుకోవాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. గ్రామస్తులు ప్రభుత్వ నిషేధిత విప్లవ సంఘాలకు, విప్లవ పార్టీలకు సకరించవద్దని వాటికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా గ్రామంలోకి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫోక్సో చట్టంతో పాటు పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

భూమి పూజ

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనలో భాగంగా బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఎంపీపీ జనగం సమ్మక్క, మాజీ సర్పంచ్ కావిరి పద్మ, కొబ్బరి కాయకొట్టి పనులు ప్రారంభించారు. కాగా, బొడ్రాయి నిర్మాణానికి కుమ్మరి అంకుమళ్లు, హన్‌మాన్ గుడికి జాడి రాజు, జనగం బంగారి భూమిని దానంగా అందజేశారు. అలాగే బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీని అధ్యక్షుడిగా మారగోని రాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావిరి సంతోష్, చిన్నికృష్ణ, జాడి రాంబాబు, సాంబశివరావు, సురేందర్, కావిరి సమ్మయ్య, తాడూరి శ్రీధర్, పోషయ్య, కారోబార్ సమ్మయ్య, దీపక్‌రాజు, బాబు, గ్రామ పెద్దలు సునార్కని ఎర్రమల్లయ్య, కుమ్మరి అంకులు నర్సింహారావు, నారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత కిడ్నాప్‌నకు యత్నం

చిట్యాల: మండల కేంద్రంలో వివాహితను కిడ్నాప్ చేసేందుకు ఓ గ్యాంగ్ ప్రయత్నించిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో వివాహిత ఇంటి ముందర ఉండగా కారులో వచ్చిన ఓ వ్యక్తి సదరు మహిళను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించగా ఆమె కేకలు వేసింది. దీంతో ఆమె భర్త, పక్క ఇంట్లో నిద్రిస్తున్న బంధువులు బయటకు వచ్చారు. మహిళ కేకలు వినిపించడంతో కారులో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. దీంతో కిడ్నాపునకు ప్రయత్నించిన సదరు వ్యక్తి పారి పోతుండగా పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సదరు వ్యక్తిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిసింది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ఇస్సిపేట, అంకుషాపురం, మొగుళ్లపల్లి గ్రామాల్లో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని తెలిపారు. రూ.30 లక్షలతో అంబులెన్స్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలు అందించడంలో జాప్యం చేస్తున్న పీఆర్‌డీఈ రవికుమార్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుజాత సంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, ప్రత్యేక అధికారి వీరస్వామి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్, జూకల్, జడలపేట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సత్యనారాయణరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ మేరకు తిర్మలాపూర్‌లో రూ.15లక్షల నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం, జడల్‌పేట శివారులోని ఈదులకుంట చెరువు మరమ్మతు పనులకు శంకుస్థాపన, జూకల్ శివారులో రూ.12.15లక్షలతో ఎస్సారేస్పీ కాలువ మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

గణపురం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం మండలంలోని చెల్పూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి రూ.10లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10లక్షలు, శివాలయం టెంపుల్ ప్రహారి గోడ నిర్మాణానికి రూ. 9.90 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఎంపీపీ కావటి రజిత, సత్యనారాయణ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



రేగొండ: బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బస్ సర్వీస్ పునరుద్ధరణ

రేగొండ: పరకాల నుంచి రేగొండ, కొత్తపల్లిగోరి మీదుగా ములుగు వెళ్లే బస్ సర్వీస్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం ప్రారంభించారు. విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, కూలీలు, ఉద్యోగులు బస్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్ గ్రామస్తులు పలుమార్లు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే కొత్తపల్లిగోరి మీదుగా ములుగు వెళ్లే బస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించడంతో అధికారులు సర్వీస్‌ను పునరుద్ధరించారు. ఈమేరకు ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. బాగిర్థిపేట లో రూ.40లక్షలతో చెరువు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ పున్నం లక్ష్మి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, నర్సయ్య, ఉమేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శారద

మహాముత్తారం: మండలంలోని పోలారం గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో బుధవారం జెడ్పీటీసీ లింగమల్ల శారద టెంకాయకొట్టి పనులను ప్రారంభించారు. నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్‌బాబుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్, బాపు, దుర్గయ్య, రాజబాపు, సదువలి, రామయ్య, పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.